సాక్షి
శ్రీకాకుళం



శనివారం ı 8 ı మార్చి ı 2025



స్వీయ నియంత్రణ స్వయం రక్షణ

జిల్లాలో మహిళలు
11,79,007

జిల్లాలో మహిళా ఓటర్లు
9,48,299



టాక్‌షోలో శివానీ కళాశాల విద్యార్థినుల ఉత్సాహం

చుట్టూ మృగాళ్లు, ఒక్క తప్పటడుగు పడినా అమాంతం లాగేసే క్రూర వేటగాళ్లు.. వీధి చివర, బస్టాండుల్లో, కూడళ్లలో వేధించే ఆకతాయిలు.. ఇవి చాలవన్నట్టు ఆన్‌లైన్‌లోనూ అనుక్షణం పీడించుకుని తినే సైబరాసురులు.. ఇందరి మధ్య ఓ అబల స్వేచ్ఛగా బతకడం నిత్య యుద్ధమే. మహిళా దినోత్సవం సందర్భంగా చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 'సాక్షి' మహిళల భద్రత, సోషల్ మీడియా ప్రభావంపై చర్చా వేదిక నిర్వహించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మాయిలు, మహిళలు తమ అభిప్రాయాలు వంచుకున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం / ఎచ్చెర్ల క్యాంపస్ / టెక్కలి / పాత బస్టాండ్ / కాశీబుగ్గ/ శ్రీకాకుళం క్రైం

సాక్షి టాక్ షో

అంశం
మహిళల భద్రత-సోషల్ మీడియా ప్రభావం



స్వీయనియంత్రణ అవసరం



మహిళలపై వేధింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. కానీ స్వీయ నియంత్రణ ఉంటే సమస్యలను ఎదుర్కోగలం. ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా పోరాడాలి.

– ఎస్.స్వాతి, అసిస్టెంట్ ప్రొఫెసర్

మానసిక బలం ప్రధానం



మహిళలు మానసికంగా, శారీకంగా బలంగా ఉండాలి. బలహీనతలను ఎదుటివారు తమకు అనుకూలంగా మార్చుకుంటారు. మనల్ని మనమే రక్షించుకోవాలి.

– ఎం.సత్యవాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్

అవసరం మేరకే వాడాలి..



సోషల్ మీడియా అవసరం మేరకే వాడాలి. ఫొటోలు, వీడియోలు షేర్ చేసుకోకపోవడమే ఉత్తమం.

– జి.ఈక్షిత, అసిస్టెంట్ ప్రొఫెసర్

నియంత్రించుకోవాలి..



వ్యక్తిగత జీవితాన్ని సోషల్ మీడియాలో పంచుకోకూడదు. చిన్న తప్పు చేసినా అదే మనల్ని వేధిస్తుంది. మన లిమిట్స్ లో మనం ఉండాలి.

– పొన్నాడ దీపిక, విద్యార్థిని

వస్త్రధారణా కీలకమే..



మహిళల వస్త్రధారణపై చాలా డిబేట్లు జరుగుతున్నాయి. మగవారిని ఆకర్షించే వస్త్రధారణ ఎప్పుడూ మంచిది కాదు.

– బాలక రమ్యశ్రీ, విద్యార్థిని

విలువలు ముఖ్యం



చెడు స్నేహాలకు దూరంగా ఉంటే మేలు. ఎవరినీ గుడ్డిగా నమ్మకూడదు. విలువలు పాటించాలి.

– ఆర్.స్వాతి, విద్యార్థిని

సెక్యూరిటీ అవసరం



సోషల్ మీడియా యాప్‌లకు సెక్యూరిటీ చాలా అవసరం. అనవసర వ్యక్తులతో పరిచయాలు మనల్ని ఇబ్బందుల్లోకి నెడతాయి.

– ఐ.సాయిప్రగతి



విద్యార్థినులకు అవగాహన

డ్రగ్స్ వద్దు



విద్యార్థినులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. చెడు స్నేహాలు దూరం పెట్టాలి. ఈ స్నేహాలే సమస్యలను తెచ్చిపెడతాయి.

– కె.మంజుల

టెస్టులు చేయించుకోవాలి



ప్రతి మహిళ ఏడాదికి రెండు సార్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ప్రధానంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వాటిపై ముందుగానే మేల్కోవాలి.

– ఎస్.లిఖిత, అసిస్టెంట్ ప్రొఫెసర్

అలెర్ట్

- ఇంటర్నెట్‌లో ఉండే డేటింగ్ వెబ్‌సైట్ /యాప్స్, ఫేక్ మ్యాట్రిమోనియల్ సైట్లలో ఉండే ఫేక్ ప్రొఫైల్స్‌పై అప్రమత్తత అవసరం.
- అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్ చాటింగ్, వీడియో కాల్స్ చేయకూడదు.
- సైబర్ మోసానికి గురయ్యేవారు గోల్డెన్ అవర్‌లో 1930 నంబర్‌కు డయల్ చేయాలి. లేదంటే డబ్లూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ఫిర్యాదు ఇవ్వాలి.
- జిల్లా ప్రజలకు హెచ్‌టీటీపీఎస్://శ్రీకాకుళంపోలీస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంది.

నారీ.. సవారీ



మెరుపులా..

ఈమె పేరు బి.మేఘన. ఇంజినీరింగ్ విద్యార్థిని. స్వస్థలం హైదరాబాద్. వాహనాన్ని మెరుపులా పరిగెత్తించడం ఈమెకు సరదా. విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న తండ్రి ఈమెకు ఆదర్శం. ప్రస్తుతం టెక్కలి ఆదిత్య కళాశాలలో జరుగుతున్న గోకార్టింగ్ రేసులో మెరుపులా దూసుకెళ్తోంది. తనకంటూ ప్రత్యేకత సాధించాలనే ఇలా రైడర్‌గా మారానని చెబుతోంది.

ముదితల్ నేర్వగ రాని విద్య గలదె.. అన్నారు చిలకమర్తి వారు. ఇప్పుడు ముదితల్ నడపగ లేని బండి గలదె.. అనాలేమో. ఔను మరి బైక్ మొదలుపెట్టి ట్రైన్ వరకు అన్నింటా అతివలు స్పీడు చూపిస్తున్నారు. అందుకు వీరే సాక్షి.

ఈమె రూటే సెపరేటు



బైక్ నడిపే అమ్మాయి కనిపిస్తేనే సమాజం కళ్లు ఇంతలు చేసుకుని చూస్తుంది. ఇప్పుడిప్పుడే ఆటోలు, బస్సులు నడిపే అతివలను చూడడం నేర్చుకుంటోంది. కానీ మరడ వాణి రెడ్డి రూటే సెపరేటు. బైక్‌లు, బస్సులు దాటి ఏకంగా ట్రైన్ నడిపే ఉద్యోగం సాధించి ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం పలాస రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె చత్తీస్ గఢ్‌లోని దుర్గ్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తల్లి ఎల్.రుక్మిణిరెడ్డి ప్రోత్సాహంతో ఈ రంగంలోకి అడుగుపెట్టారు. పలాస రైల్వేస్టేషన్ మీదుగా నడిచే వందేభారత్ రైలును నడుపుతున్నారు. రోజుకి 220 కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తారు. తన కుటుంబం పరిసర ప్రాంతాల ప్రజలు తనను వింతగా చూస్తుంటారని, తాను కూడా ఇదే కోరుకున్నానని గర్వంగా ఆమె చెబుతుంటారు.



బుల్లెట్టు బండెక్కి..

బుల్లెట్ నడపడం అంత తేలిక కాదు. కానీ చిలకపాలెంకు చెందిన పి.అను మాత్రం రయ్‌రయ్‌మంటూ బుల్లెట్‌పై సవారీ చేస్తున్నారు. ఈమె చిలకపాలెం శివానీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ధైర్యసాహసాల్లో మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



గీతాసారం

యార్లగడ్డ గీతాశ్రీకాంత్.. ఓవైపు పారిశ్రామిక వేత్తగా ఎదుగుతూ, మరోవైపు సామాజిక సేవల్లో ఒదుగుతున్నారు. పాతికేళ్లుగా ఆమె ఎన్నో రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ మహిలు ఎదిగేందుకు కృషి చేసి జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్తగా గుర్తింపు పొందారు. ట్రాక్టర్ల బిజినెస్ చేస్తూ తానూ ట్రాక్టర్ నడపడం నేర్చుకున్నారు. గిరిజన మహిళల జీవనంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. 100 యువ టూరిజం క్లబ్‌లను టూరిజం సహకారంతో ఏర్పాటు చేశారు. జల యోగా ప్రదర్శన ద్వారా 30 రకాల ఆసనాలు నీటిలో వేసి నేషనల్ అవార్డు పొందారు.

సాహ'షి'

దేశ రక్షణ బాధ్యత నాది కూడా అంటోంది సాహషి. అనాదిగా మగాళ్ల రాజ్యంగా పేరొందిన రక్షణ శాఖలో ఇప్పుడు ఆడ సింహాలు కూడా గర్జిస్తున్నాయి.

8లో

మీరే స్ఫూర్తి ..

8లో

టెక్కలి ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు స్ఫూర్తిగీతిక ఆలపించారు. మహిళా దినోత్సవం సందర్భంగా తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

ఆమేయం.. అజేయం..

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి మచ్చుకైనా కనిపించడం లేదు.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్,

ఆత్మవిశ్వాసంతో ముందుకు..



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి. ఉన్నతమైన ఆలోచనలతో, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి. తల్లిదండ్రులు మహిళలను విద్యలో ప్రోత్సహించాలి. కుటుంబాన్ని, సమాజాన్ని మహిళలు ఆదర్శంగా తీర్చి దిద్దగలరు.

– ప్రొఫెసర్ కేఆర్ రజిని, వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

చదువే మూలధనం



మహిళలు రాణించాలంటే చదువు చాలా ముఖ్యం. చక్కగా చదువుకుంటేనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలం. కుటుంబ బాధ్యతలు కూడా మహిళలకు కీలకమే. – ప్రసన్న లక్ష్మి, జేడీ, సీపీఓ కార్యాలయం,

వివక్ష లేని సమాజం కావాలి..



వివక్ష లేని, వేధింపులు లేని, సమసమాజం వచ్చిన నాడే ఈ కార్యక్రమాలకు, ఈ ఉత్సవాలకు అర్థం ఉంటుంది. ఆ దిశగా మనమంతా కృషి చేయాలి.

– ఆర్.గడ్డెమ్మ, ఈడీ, బీసీ కార్పొరేషన్

మహిళలే రథ సారథులు



నేటి సమాజంలో మహిళలే కుటుంబాలకు రథ సారథులుగా ఉన్నారు. నా విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలోనే పూర్తయ్యింది. అనేక సమస్యలు ఎదుర్కొని ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను. చిన్న సమస్యకు కుంగిపోకూడదు, విజయాలు వచ్చినప్పుడు పొంగిపోకూడదు దేనినైనా సవాలుగా తీసుకుని ముందుకు సాగాలి. శారీరక ధైర్యం అనేది శారీరక నొప్పిని ఎదుర్కొంటుంది, అయితే నైతిక ధైర్యం ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతుంది.

– బి.కరుణశ్రీ, ఈఈ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు

లక్ష్యం నిర్దేశించుకోండి



ప్రతి బాలిక చదువుకునే సమయంలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలి. కష్టపడి ఆ లక్ష్యాన్ని సాధించాలి. మనం పట్టుదలగా ఉంటే కుటుంబ సభ్యులు కూడా సహకరిస్తారు.

– కె.సాయి ప్రత్యూష, ఆర్డీఓ, శ్రీకాకుళం

సమానత్వం కీలకం



మహిళలు తమ కర్తవ్యాన్ని గుర్తు చేసుకోవాల్సిన రోజు ఇది. సాధికారత, సమానత్వం రెండూ సాధించాలి.

– ఇ.అనురాధ, డీటీసీ, శ్రీకాకుళం

అన్ని రంగాల్లో ఎదగాలి..



పురుషులతో సమానంగా అన్నింటా ఎదగాలి. అప్పుడే నిజమైన మహిళా దినోత్సవం సాధ్యమవుతుంది. మహిళల సంరక్షణ ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలి. – కె.కవిత, సహాయ సంచాలకులు, వికలాంగుల సంక్షేమ శాఖ, శ్రీకాకుళం

బతుకు నిత్య నృత్యం



స్వాతీ సోమనాథ్.. ఈ పేరు చెబితే చాలు.. మరీ ఎక్కువ పరిచయం అక్కర్లేదు. దూసి గ్రామంలో మొదలైన ఆమె ప్రస్థానం నేడు ఖండాంతరాలు దాటింది. కూచిపూడి నృత్య కళతో అంచెలంచెలుగా ఎదిగారు. ఆమె 1980లో అరంగ్రేటం చేశారు. దాదాపుగా వెయ్యి సోలో ప్రదర్శనలు ఇచ్చారు. ఎంఏ ఇంగ్లిష్, ఎంఫిల్ పూర్తి చేశారు. సెంట్రల్స్ యూనివర్సిటీలో ఆర్ట్స్‌లో మాస్టర్ పెర్ఫామెన్స్ చేశారు. దాదాపు 40 దేశాలు పర్యటించి ప్రదర్శనలు చేశారు. 13 బ్యాలేలు రూపొందించారు. శ్రీకాకుళంలో కూచిపూడి సంప్రదాయ గురుకులం నిర్వహిస్తూ కళకు కాపలా కాస్తున్నారు. ఇంతవరకు ఎవరూ చేయని కిన్నెరసాని పాటలకు 45 నిమిషాల పాటు బాలేను రూపొందించారు. త్వరలో అమెరికాలో జరిగే తానా సభలలో సంప్రదాయం చిన్నారులచే ప్రదర్శన కోసం కృషి చేస్తున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

సేవల్లో హేమంతం



హేమలత ఓ టీచర్. కానీ పాఠాలు తరగతి గదిలోనే కాదు సమాజంలోనూ చెబుతున్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి ఆర్తులకు ఆపన్న హస్తం అందిస్తున్నారు. పేద పిల్లలకు సాయం చేయడం, మానసిక దివ్యాంగులను, కేన్సర్ రోగులకు ప్రోటీన్ ఫుడ్ అందించడం, గిరిజనులకు సాయం అందించడం వంటి పనులు చేస్తుంటారు. కరోనా సమయంలో ప్రైవేటు స్కూల్స్‌లో పనిచేస్తున్న పేద టీచర్లకు నెల సరుకులు అందజేశారు.

ఇది కాంతమ్మ గారి నూలు



పొందూరులో జల్లేపల్లి కాంతమ్మ 'నూలు' నడుస్తోంది. దేశంలోనే నూలును నాణ్యంగా వడికే పనితనం ఆమె సొంతం. 75 ఏళ్ల వయసున్న కాంతమ్మ ఆరేళ్ల వయసు నుంచి ఈ పనిచేస్తున్నారు. ఈమె నైపుణ్యానికి మెచ్చి ఏకంగా ప్రధాని మోదీ ఆమెను ఢిల్లీ రప్పించి మరీ కలిశారు. ఇంత చేసీ ఆమె సంపాదన రోజుకు రూ.200 మాత్రమే. కానీ సంతృప్తి మాత్రం అనంతం.

– పొందూరు

రంగమేదైనా.. కీర్తీ.. ఖ్యాతీ.. మాదే..

రంగం ఏదైనా సిక్కోలు మహిళ విజయ విహారం చేస్తోంది. ఆటల్లో అదరగొడుతూనే లలిత కళల్లోనూ మన పడతి రాణిస్తోంది. పాఠాలు చెబుతూనే సమాజానికి గుణపాఠాలు నేర్పుతోంది. చదువుల సరస్వతిగా కీర్తిని అందుకుంటూనే.. సమాజ సేవకిగా ఖ్యాతినీ ఆర్జిస్తోంది.

హాస్టల్‌లో అమ్మ



బీసీ బాలికల వసతి గృహ మేట్రిన్‌గా పైడి పద్మావతి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. 19 ఏళ్ల వయసులో సర్వీసులో చేరిన ఆమె వసతి గృహ మేట్రిన్‌గా 23 ఏళ్ల సర్వీసు పూర్తి చేశారు. ఎక్కడకు వెళ్లినా అక్కడి పిల్లలను కన్నబిడ్డల్లా చూసుకోవడం ఆమెకు ఇష్టం. పండగలు, పిల్లల పుట్టిన రోజులు ఇంట్లో కంటే హాస్టల్‌లోనే బాగా జరుగుతాయని పిల్లలే చెబుతుంటారు. పిల్లలకు ఒంట్లో బాగోలేకపోయినా ఆమె సొంత ఖర్చుతో వైద్యం చేయిస్తారు. పిల్లలు ఎక్కడెక్కడి నుంచో ఇక్కడకు వస్తారని, ఇక్కడ తల్లీతండ్రి తానే అయి చూసుకుంటానని చెబుతారు. సమాజంలో మహిళలకు తగిన గౌరవం, ప్రాధాన్యత లభించాలనేదే తన ఆలోచన అని అన్నారు


– నరసన్నపేట

ది బెస్ట్ క్యాచర్



ఎచ్చెర్ల మండల పరిధిలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన గురుగుబెల్లి దుర్గాప్రశాంతి సాఫ్ట్‌బాల్‌లో జాతీయ స్థాయిలో మెరుస్తోంది. ఈమె తల్లిదండ్రులు లక్ష్మణరావు, కృష్ణవేణి వ్యవసాయం చేస్తుంటారు. అయినా ఏ మాత్రం బెరుకు లేకుండా బిడ్డను క్రీడల్లో ప్రోత్సహించారు. ఆమె 7వ తరగతిలో ఉన్నప్పుడు సాఫ్ట్‌బాల్‌లో రంగప్రవేశం చేసి ఇప్పుడు జాతీయ స్థాయికి ఎదిగింది. చక్కటి క్యాచర్‌గా ఆమెకు గుర్తింపు ఉంది. మొత్తం 9 రాష్ట్రస్థాయి, 5 జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. వీటిల్లో మూడు పతకాలు సాధించింది. ప్రస్తుతం విజయవాడలోని ఎస్ఆర్ఐ అకాడమీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వం ఉద్యోగం సాధించడంతోపాటు శ్రీకాకుళం జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడ మరింత పురోగాభివృద్ధికి అవసరమైన సాయం చేస్తానని 'సాక్షి'కి చెబుతోంది.

–శ్రీకాకుళం న్యూకాలనీ


బైనాక్యులర్‌తో శత్రువుల ఉనికిని గమనిస్తున్న మహిళా జవాన్

దేశ రక్షణలో సాహషి



వజ్రపుకొత్తూరు రూరల్: తరతరాలుగా కుటుంబ బాధ్యతలకే పరిమితమైన ఆడపడుచులు నేడు దేశ సరిహద్దుల్లో ముష్కరులను మట్టికరిపిస్తున్నారు. బ్రిటీషర్లను తరిమికొట్టిన వీరనారుల వీరత్వాన్ని అందిపుచ్చుకొని సిక్కోలు యువతులు సివంగిలా మారి దేశ రక్షణకు సై అంటున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా నుంచి సుమారు 350 మంది వరకు యువతులు త్రివిధ దళాల్లో చేరినట్లు సైన్యాధికారులు చెప్పున్నారు.

గర్వంగా ఉంది



కఠోర సాధన చేసి మొదటి ప్రయత్నంలోనే ఎస్ఎస్‌సీ పరీక్షలో ప్రతిభ కనబర్చి నాలుగేళ్ల క్రితం బీఎస్ఎఫ్‌కు ఎంపికయ్యాను. దేశ రక్షణ కోసం సరిహద్దులలో విధులు నిర్వర్తించడం గర్వంగా ఉంది.
– కె.స్రవంతి, సీతాపురం, బీఎస్ఎఫ్ జవాన్, వజ్రపుకొత్తూరు మండలం


సమాజంలో గుర్తింపు



గొర్రెల కాపరి కుటుంబంలో పుట్టిన నేను దేశ సైన్యంలో చేరాలన్న కోరికతో ప్రతి రోజు కఠోర సాధన చేశాను. మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో లక్ష్యం సాధించాను. ఇండియన్ నేవికి ఎంపికై ప్రస్తుతం ఒడిశాలో శిక్షణ పొందుతున్నాను.
– బందాపు శ్రీనిధి, ఇండియన్ నేవి, వజ్రపుకొత్తూరు మండలం



శ్రీకాకుళం/న్యూకాలనీ: శ్రీకాకుళం మహిళా కళాశాల ఆడిటోరియంలో శక్తి, ప్రగతి సంఘాల మహిళా దినోత్సవ సంబరాలు



క్లుప్తంగా

ఆరో రోజు ఒకరు డిబార్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం సెకండియర్ విద్యార్థులు సెట్–2 ప్రశ్న పత్రంతో మాథ్స్ 2ఎ, బోటనీ, సివిక్స్ పేపర్–2, ఇతర ఒకేషనల్ పేపర్లకు పరీక్ష రాశారు. జనరల్, ఒకేషనల్ రెండు విభాగాల్లో కలిపి 18763 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 385 మంది గైర్హాజరయ్యారు. 6వ రోజు జిల్లాలో ఒక మాల్‌ప్రాక్టీసు కేసు నమోదైంది. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకెండియర్ మాథ్స్ 2ఏ పరీక్ష రాస్తున్న ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీసుకు పాల్పడుతూ పట్టుబడటంతో అధికారులు డీబార్ చేశారు.

రెండు టన్నుల చింతపండు పట్టివేత

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామ సమీపంలో శుక్రవారం ఒడిశా రాష్ట్రం గుణుపురం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా తీసుకొస్తున్న చింతపండు వ్యాన్‌ను అటవీ శాఖ ఎస్ఎఫ్ఓ ఈశ్వరరావు పట్టుకున్నారు. సుమారు 2 టన్నుల చింతపండును గుణుపురం నుంచి నరసన్నపేటకు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. అనుమతులు లేకపోవడంతో వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.నరసన్నపేటకు చెందిన ఒక వ్యాపారి నిత్యం ఇదే మార్గంలో ఒడిశా నుంచి చింతపండు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

తెరుచుకోని గ్యాస్ గోదాం


గోదాం నుంచి వెనుదిరుగుతున్న లబ్ధిదారులు

పొందూరు రూరల్: పొందూరులో గ్యాస్ ఇబ్బందులు తప్పడం లేదు. గత వారం రోజులుగా గ్యాస్ లభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ బుక్ చేసినప్పటికీ ఇవ్వటం లేదు. గోదాం దగ్గరకు వచ్చి తీసుకుందామంటే తాళాలు వేసి ఉంటున్నాయి. గ్యాస్ గోదాం దగ్గరకు వచ్చిన లబ్ధిదారులు తమ గోడును వినిపించుకుంటున్నారు. శుక్రవారం రాపాక, పిల్లలవలస, ఎరుకులపేట, పొందూరుకు చెందిన పలువురు లబ్ధిదారులు గ్యాస్ గోడౌన్‌కు వచ్చి ఉసూరుమని తిరిగి వెనుకకు ఖాళీ సిలిండర్లతో వెళ్లిపోయారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ


చోరీ జరిగిన ఆలయం ఇదే

వజ్రపుకొత్తూరు: మండలంలోని సుంకర జగన్నాథపురం దుర్గమ్మ తల్లి ఆలయంలో గురువారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. తాళాలు పగలుగొట్టి వెండి, బంగారం నగలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం దాసురాలమ్మ గాడి హైమావతి ఆలయం వద్దకు రాగా.. తాళం పగలుగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఆభరణలు మాయం కావడంతో వజ్రపుకొత్తూరు పోలీసులకు సమాచారమిచ్చారు. చోరీలో రెండు కిలోల బరువు కలిగిన వెండి పళ్లెం, అమ్మవారి విగ్రహం, కిరీటం, బల్లెం, గ్లాసు, రెండు తులాల బంగారం శతమానాలు, ముక్కు పుడకలు, కాసులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పూండి – నౌపడ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న దేవాలయం కావడంతో దొంగలు రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీరే స్ఫూర్తి

వారంతా వెనుకబాటుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే శ్రీకాకుళం జిల్లాలో జన్మించినా అనుకున్న లక్ష్యం సాధించారు. ఈ క్రమంలో ఎన్ని అవాంతరాలు ఎదురైన మొక్కవోని దీక్షతో అధిగమించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ అత్యున్నత స్థానాలను అధిరోహిస్తూ నేటితరానికి స్ఫూర్తిగా నిలిచారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల మహిళలు సైతం తాము అనుకుంటే ఏదైనా సాధించగలరనే నమ్మకాన్ని కలిగించారు. నేటితరం విద్యార్థినులు ఇలాంటి మహిళామణుల విజయగాథలను తెలుసుకుంటున్నారు. వీరి అడుగుజాడల్లోనే నడిచి లక్ష్యాన్ని సాధిస్తామని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ద్వారా 'సాక్షి' శుక్రవారం టాక్ షో నిర్వహించింది. దీనిలో భాగంగా విద్యార్థినులు వారి ఆలోచనలు..లక్ష్యాలు.. ఆశయాలను వేదిక ద్వారా పంచుకున్నారు. –టెక్కలి

- జిల్లా మహిళామణులే ఆదర్శం
- ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుకడుగు వేయం
- అనుకున్న లక్ష్యం సాధిస్తాం
- 'సాక్షి' టాక్‌షోలో మనోగతం వెల్లడించిన టెక్కలి ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థినులు



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సాక్షి టాక్ షోలో విద్యార్థినులు, అధ్యాపకులు



లక్ష్యం సాధించాలి



మహిళలు తమ గౌరవాన్ని మరింత పెంచుకునేలా లక్ష్యాలను సాధించుకోవాలి. విద్యార్థి దశ నుంచి ఉన్నతమైన ఆలోచనలతో విద్యనభ్యసిస్తే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చు.
– వై.లీలాపద్మజ, తెలుగు అధ్యాపకురాలు, మహిళా సాధికారత విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి

జిల్లా విజేతలే ఆదర్శం...



మన చుట్టూ ఉన్న ఎంతో మంది మహిళలు విభిన్నమైన రంగాల్లో గొప్ప స్థానాల్లో ఉన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నతమైన లక్ష్యంతో అడుగులు వేయాలి. మనం అనుకున్న ప్రతి ఆలోచలను సాకారం చేసుకోవాలి.
– బి.ఝాన్సీరాణి, ఆంగ్ల అధ్యాపకురాలు, మహిళా సాధికారత విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి

నిరంతరం శ్రమించాలి..



ఉన్నతమైన స్థానంలో ఉండాలనే లక్ష్యంతో మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థి దశ నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరుకోవడానికి నిరంతరం శ్రమించాలి.
– టి.గోవిందమ్మ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి

దేశ సేవ చేస్తా...



ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలనే లక్ష్యం ఉంది. రక్షణ రంగంలో మన సైనికులు దేశం కోసం ఎంతో మంది ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేస్తాను.
– ఎం.రేవతి, మొదటి సంవత్సరం, బీఎస్సీ

వ్యాపారవేత్తగా స్థిరపడతా...



అందరిలో ఒకరిలా కాకుండా పది మందికి ఉపాధి కల్పించే వ్యాపారవేత్తగా ఎదగాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాను. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలను స్థాపించడమే లక్ష్యం.
– కె.లావణ్య, మొదటి సంవత్సరం, బీఏ

ఐపీఎస్ అవుతా..



భవిష్యత్‌లో ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం. మహిళలకు అండగా ఉండాలన్నదే నా ఆశయం.
–ఎస్.కుమారి, మొదటి సంవత్సరం, బీఏ

ఐఏఎస్ లక్ష్యం



భవిష్యత్‌లో ఐఏఎస్ కావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాను. ఐఏఎస్ అధికారిగా పేదలకు ప్రభుత్వ సేవలు అందజేయడానికి అవకాశం ఉంటుంది.
– ఎం.సిరి, మొదటి సంవత్సరం బీఎస్సీ

సరికొత్త ఆవిష్కరణలు..



కంప్యూటర్ పరిశోధనలో రాణించాలనే లక్ష్యంతో చదువుతున్నాను. దీనికి మా కుటుంబం ఎంతగానో ప్రోత్సహిస్తోంది. కళాశాలలో అధ్యాపకుల సహకారంతో కంప్యూటర్ రంగంలో మరిన్ని ఆవిష్కరణలు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాను.
– ఇ.మమత, ద్వితీయ సంవత్సరం, బీఎస్సీ

మల్లీశ్వరి స్థాయికి..



మాది సాధారణ కుటుంబం. చిన్నతనం నుంచి వెయిట్‌లిఫ్టింగ్‌పై మక్కువ. మన జిల్లాకు గర్వకారణమైన కరణం మల్లీశ్వరి స్థాయికి ఎదగాలని ఆకాంక్ష ఉంది. అదే లక్ష్యంగా చదువుతో పాటు వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతున్నాను. యూనివర్సిటీ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను.
– ఎస్.ఝాన్సీరాణి, బీఏ ఫస్టియర్, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి

అథ్లెట్‌గా రాణిస్తా..



నాకు చిన్నతనం నుంచి అథ్లెటిక్స్‌పై ఎంతో ఆసక్తి. అదే మక్కువతో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాను. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకువస్తాననే నమ్మకం ఉంది.
– బి.వెంకటలక్ష్మి, ద్వితీయ సంవత్సరం, బీఎస్సీ

లెక్చరర్ కావడమే లక్ష్యం



భవిష్యత్‌లో లెక్చరర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నాను. బోధన వృత్తి ద్వారా ఎంతో మంది భావిభారత పౌరులను తీర్చిదిద్దగలిగే అవకాశం ఉంటుంది. అందుకే లెక్చరర్‌ను కావాలని బలంగా అనుకుంటున్నాను.
– పి.దివ్య, మొదటి సంవత్సరం, బీఎస్సీ

వ్యవసాయం చేస్తా..



పది మంది కోసం శ్రమిస్తున్న వ్యవసాయ రంగం అంటే ఎంతో గౌరవం. భవిష్యత్‌లో గ్రామీణ ప్రాంత రైతులకు అనుకూలంగా వ్యవసాయం చేయాలనే లక్ష్యం ఉంది.
–సీహెచ్.శిరీషా, మొదటి సంవత్సరం, బీఎస్సీ

మహిళా పోలీసుల ఆనందహేల


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


మహిళా పోలీసుల సందడి

శ్రీకాకుళం క్రైమ్:

మహిళా దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా పోలీసుల వేడుకలు సందడిగా జరిగాయి. డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శ్రీకాకుళం రూరల్, రెండో పట్టణ, మహిళా పోలీస్ స్టేషన్లకు చెందిన మహిళా పోలీసులు, స్థానిక కాకినాడ ఆదిత్య కళాశాల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తన ఎదుగుదలలో మహిళల నిర్ణయాలే ప్రధాన భూమిక పోషించాయని, బ్యాక్‌బెంచ్ ఇంజినీరింగ్ స్టూడెంట్ అయిన తాను ఐపీఎస్‌పై ఆసక్తి పెట్టడానికి ఐఏఎస్, ఐఆర్ఎస్‌లుగా ఉన్న దంపతులే కారణమని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, సీఐలు పైడపునాయుడు, ఈశ్వరరావు, ఇమ్మాన్యుయల్ రాజు, ఎస్ఐలు హరికృష్ణ, రాము, జనార్దన, మహిళా పోలీసుస్టేషన్ సీఐ త్రినేత్రి, ఎస్ఐ లక్ష్మి, చంద్రకళ అధిక సంఖ్యలో మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ బెడ్లు పెంచాలి


కవిటిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత పిరియా సాయిరాజ్

కవిటి: కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం డయాలసిస్ బెడ్ల సంఖ్య పెంచాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత పిరియా సాయిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కవిటిలో మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా కవిటి మండలంతో పాటు చాలా కేంద్రాల్లో డయాలసిస్ కోసం వేచి చూసే రోగులసంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో డయాలసిస్ బెడ్‌ల సంఖ్య పెంపు దిశగా ఆలోచన చేయాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత పింఛన్లను రూ.10వేలకు పెంచాలని గుర్తు చేశారు. కవిటిలో పదిలోపు ఉన్న బెడ్‌ల సంఖ్యను 19కు పెంచిన విషయాన్ని తెలిపారు. ఇచ్ఛాపురంలో డయాలసిస్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారని, దాన్ని ప్రారంభించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు కడియాల ప్రకాష్, జల్లు యుగంధర్, పి.చంద్రశేఖర్, ఎస్‌పీ నారాయణస్వామి, భద్రాచలం, వై.నీలయ్య, కొర్రాయి గోపాల్, దుద్ది ధర్మారావు పాల్గొన్నారు.



రయ్ రయ్ రయ్!

- ఆదిత్యలో అట్టహాసంగా ముగిసిన గోకార్టింగ్ సీజన్–2 పోటీలు
- విజేతలుగా రఘు, బీవీఆర్ఐటీ కళాశాల విద్యార్థులు


ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో గోకార్టింగ్ పోటీలు



ఎలక్ట్రికల్ (ఈవీ) విభాగంలో చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన బీవీఆర్ఐటీ కళాశాల విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, కళాశాల యాజమాన్య ప్రతినిధులు



గోకార్టింగ్ పోటీల్లో పెట్రోల్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన రఘు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

టెక్కలి: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల వేదికగా గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్–2 పోటీలు శుక్రవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీల్లో పెట్రోల్ విభాగం (సీవీ) విశాఖపట్టణం రఘు ఇంజినీరింగ్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అలాగే ఎలక్ట్రికల్ (ఈవీ) విభాగంలో హైదరాబాద్‌కు చెందిన బీవీఆర్ఐటీ కళాశాల విద్యార్థినులు చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. ముగింపు సందర్భంగా టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, తమిళనాడు ప్రాంతాలకు చెందిన సుమారు 16 బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అంతకుముందు టెక్కలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు, సీఐ ఎ.విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం ఆద్యంతం యువత సందడి చేశారు.